క్లుప్తంగా

తిరుచ్చి వాహనంపై శ్రీనివాసుడు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటంరోడ్డులో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ, ఆలయ ప్రధాన అర్చకులు వీరేశాచార్యులు, ధనలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్బీకేను పరిశీలించిన పీఆర్ ఈఈ

బ్రహ్మంగారిమఠం : పలుగురాళ్లపల్లెలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని గురువారం పంచాయతీరాజ్ ఈఈ రామచంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండలంలో జరుగుతున్న రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఆయా కాంట్రాక్టర్లకు ఆదేశించామన్నారు. ప్రభుత్వం బిల్లులను త్వరితగతిన చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో బి.మఠం పంచాయతీరాజ్ ఏఈ ప్రతాప్, పలుగురాళ్లపల్లె ఉప సర్పంచ్ దుగ్గిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల ఎంపీడీఓగా చంద్రమౌళీశ్వర్

పోరుమామిళ్ల : బి.కోడూరులో ఎంపీడీఓగా పనిచేస్తున్న చంద్రమౌళీశ్వర్ గురువారం పోరుమామిళ్ల ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న నూర్జహాన్ బద్వేలుకు బదిలీపై వెళ్లారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో వివిధ అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు.

నేడు ఐసీడీఎస్ ప్రాజెక్టు భవనం ప్రారంభం

చాపాడు : మండల కేంద్రంలో శుక్రవారం నూతనంగా ఏర్పాటైన స్త్రీ శిశు సంక్షేమ శాఖ డివిజన్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి నియోజకవర్గ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ప్రాజెక్టు సీడీపీఓ సావిత్రమ్మ తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లతోపాటు ప్రజాప్రతినిధులందరూ హాజరుకావాలని సీడీపీఓ కోరారు.

తైక్వాండోలో పోరుమామిళ్ల విద్యార్థిని ప్రతిభ

పోరుమామిళ్ల : ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్లకు చెందిన సంగా భవ్య కాంస్య పతకం సాధించింది. రాష్ట్రం నుంచి తైక్వాండో పోటీల్లో పాల్గొన్న వారిలో ఇద్దరు మాత్రమే పతకాలు సాధించగా అందులో భవ్య ఒకరు. విశాఖపట్నంకు చెందిన విద్యార్థి రజతం సాధించాడు. భవ్య 19, 68 కేజీల విభాగాల్లో ప్రతిభ కనపరచినట్లు మాస్టర్ నాయబ్‌రసూల్ తెలిపారు. గురువారం భవ్యను ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అభినందించారు.

విధుల్లో నిర్లక్ష్యం సహించేది లేదు

పోరుమామిళ్ల : విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించబోనని జిల్లా వైద్య ఆరోగ్య ఉప అధికారి డాక్టర్ చంద్రహాసరెడ్డి హెచ్చరించారు. గురువారం టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎవరికి ఇచ్చిన టార్గెట్ వారు తప్పని సరిగా పూర్తి చేయాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రాజుపాళెం : అన్ని శాఖల మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ ఇందిరా రాణి పేర్కొన్నారు. మండలంలోని గాదెగూడూరు సచివాలయంలో గురువారం సాయంత్రం స్పందన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ షాకీర్ ఆలీఖాన్, ఇందిరా క్రాంతి పథం ఏపీఎం జయరాజ్, హౌసింగ్ ఏఈ శేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాచమల్లును కలిసిన మెప్మా పీడీ

ప్రొద్దుటూరు : మెప్మా పీడీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సురేష్ రెడ్డి గురువారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని మున్సిపల్ కార్యాలయంలో కలిశారు. ప్రభుత్వం డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే రుణమాఫీ ప్రక్రియను చేపట్టిందని సురేష్ రెడ్డి తెలిపారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : ఖాదర్‌పల్లె గ్రామ సచివాలయ పరిధిలోని నాగులపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

అభ్యాస్ విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు: స్థానిక అభ్యాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఏపీ ఎంసెట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. వాసవి 1885, హాసిని 2303, తనూజ 2373, నందిని 4544, హర్షిత 4750, మాధురి 5600, సాయితరుణ్ 6090, కృష్ణారెడ్డి 7106 ర్యాంకులు సాధించారు. వీరిని కరస్పాండెంట్ బచ్చల వీరప్రతాప్, ప్రిన్సిపాల్ జగదీశ్వరరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

విద్యా సంస్కరణలు దేశానికే ఆదర్శం

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆహార్యం మారుస్తాం : డీఈఓ రాఘవరెడ్డి
- పండుగ వాతావరణంలో జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ప్రదానం



ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థినికి నగదు, జ్ఞాపికను ఇస్తున్న డీఈఓ రాఘవరెడ్డి



ఉపాధ్యాయులను, విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ



టెన్త్ విద్యార్థినులు సోమల వెంకటరామశరణ్య, శీల హరిణిలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

మైదుకూరు : రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని డీఈఓ వై.రాఘవరెడ్డి అన్నారు. మైదుకూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ప్రదాన కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ రాఘవరెడ్డి మాట్లాడుతూ పేద, మధ్య తరగతికి చెందిన పిల్లలు కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. తాము చదువుకునే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు బోదకొట్టాల్లో ఉండేవని, నిక్కరు, చొక్కాతో, టిఫిన్ క్యారియర్ అన్నం, పచ్చడి, మజ్జిగ పెట్టుకొని ఐదారు మైళ్లు నడుచుకుంటూ బడికి వెళ్లేవాళ్లమని పేర్కొన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించారన్నారు. జగనన్న విద్యా కానుక పేరుతో యూనిఫాం, బూట్లు, టై, బెల్ట్, షూస్ అందిస్తున్నారని తెలిపారు. అప్పట్లో తమకు కొత్త పుస్తకాలు ఉండేవి కావని, సీనియర్లు వాడిన, చినిగి పోయిన పుస్తకాలు తెచ్చుకొని చదువుకునే వారమన్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఏటా కొత్త పుస్తకాలను ఇస్తోందని తెలిపారు. ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్న ఈ ప్రభుత్వ హయాంలో చదువుకోవడం ఇప్పటి పిల్లల అదృష్టమని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆహార్యాన్ని మారుస్తామని డీఈఓ రాఘవరెడ్డి అన్నారు. ఇందు కోసం పాఠశాలల హెడ్ మాస్టర్లకు గైడ్ లైన్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇటీవల వల్లూరు ఆదర్శ పాఠశాలలో పదో తరగతి పరీక్షల అనంతరం విద్యార్థులు తరగతి గదుల్లోని ఫ్యాన్లు, వాకిళ్లు, కిటికీలను ధ్వంసం చేశారని, ఇది క్రమశిక్షణా రాహిత్యమన్నారు. మనది నిర్మాణాత్మకమైన సంస్కృతే కాని, విధ్వంసం చేసేది కాదని చెప్పారు. విద్యార్థులను చూడగానే మంచి భావన కలిగేలా ఉండాలని, ఆ విధంగా ఆహార్యం ఉండాలన్నారు. ఎవరైనా జుట్టు ఎబ్బెట్టుగా పెంచుకొని వస్తే, ఉపాధ్యాయులే సెలూన్‌కు తీసుకెళ్లి కత్తిరించాలని సూచించారు. ఉపాధ్యాయుల ఆహార్యం కూడా విద్యార్థులకు గౌరవ భావన కలిగేలా, అనుసరణీయంగా ఉండాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఇంటర్, పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులతో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి, పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు పొందిన వారికి డీఈఓ నగదును, మెడల్, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో చదువు గురించి ప్రబోధనాత్మక పాటలు, నృత్యాలతో అలరించిన స్థానిక సుధీర్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులను అభినందించిన డీఈఓ అకాడమీ మాస్టర్‌కు జ్ఞాపికను అందించారు. మైదుకూరు, ఖాజాపేట ఎంపీడీఓలు రమణారెడ్డి, సుమిత్ర, మైదుకూరు, బి.మఠం, ఖాజీపేట ఎంఈఓలు పద్మలత, పుల్లయ్య, స్వర్ణలత, ఖాజీపేట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయనరసింహరాజు, మైదుకూరు జెడ్పీ హైస్కూల్ బాలుర, బాలికల హెడ్‌మాస్టర్లు రమాదేవి, గంగాభవాని, డిప్యూటీ తహసీల్దార్లు మల్లికార్జున, బాబా ఫక్రుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన సంస్కరణలతోనే ఉత్తమ ఫలితాలు

బద్వేలు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో తీసుకువచ్చిన నూతన సంస్కరణలతోనే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించగలిగారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యావ్యవస్థలో సంస్కరణలు చేపట్టి ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం నియోజకవర్గంలో పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పోరుమామిళ్ళకు చెందిన డి.విష్ణువర్ధన్ (578), బద్వేలుకు చెందిన ఎన్.వెంకటశివ (578), పోరుమామిళ్ళకు చెందిన కేశవవీరగురువర్ధన్ (578), కలసపాడుకు చెందిన వీరవైష్ణవి (576), బద్వేలుకు చెందిన మెర్సీరాణి (574), ఇంటర్మీడియట్‌లో నాగశిరీష (882), మణికుమారి (832), చైతన్యలక్ష్మి (947), గిరిజ (744)లకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేసి వారి తల్లిదండ్రులతో కలిపి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, అల్లాబకాష్, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, పోరుమామిళ్ల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జయసుబ్బారెడ్డి, ఆయా మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.

విద్యతోనే దేశం అభివృద్ధి

ప్రొద్దుటూరు : విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్ద పీట వేశారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని సభాభవనంలో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యాభివృద్ధికి సంబంధించి ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు చేపట్టారన్నారు. దేశ భవిష్యత్తుకు విద్యే సరైన అస్త్రమని ఆయన భావించారన్నారు. మన బడి నాడు–నేడు, జగనన్న అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ లాంటి కార్యక్రమాలు ప్రవేశపెట్టడంతో నేడు ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడుతున్నాయన్నారు. మా పాఠశాలలో సీట్లు లేవని బోర్డులు పెట్టే పరిస్థితి వచ్చిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సావిత్రమ్మ, ఎంపీడీఓ కుళ్లాయమ్మ, ప్రధానోపాధ్యాయులు కొండారెడ్డి, కాశీప్రసాద్‌రెడ్డి, సత్యబాబు, గోపీనాథరెడ్డి, ఇమాం హుస్సేన్, అట్లా నరసింహారెడ్డి, గజ్జల వెకటేశ్వరరెడ్డితోపాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు. ముందుగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

టెన్త్, ఇంటర్ విద్యార్థులకు బహుమతులు

టెన్త్‌లో 590 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకులు పొందిన వైవీఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని సోమల వెంకటరామశరణ్య, ఎస్‌పీసీఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని శీల హరిణి, 577 మార్కులు సాధించి ద్వితీయ స్థానం పొందిన దొరసానిపల్లె జెడ్పీహైస్కూల్ విద్యార్థిని మహేశ్వర్ల ఓంసాయి, 575 మార్కులు సాధించి తృతీయ స్థానం పొందిన ఎస్‌పీసీఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని పోలంకి సుచరితలకు వరుసగా రూ.15 వేలు, రూ.10వేలు, రూ.5వేలు చొప్పున నగదు, ప్రశంసాపత్రం, మెడల్స్ అందించారు. ఇంటర్ ఫలితాల్లో సీఈసీలో 909 మార్కులు సాధించిన ప్రొద్దుటూరు ప్రభుత్వ జూనియర్ కాలేజి విద్యార్థి టప్పా ఉమర్ ఫరూక్, హెచ్ఈసీలో 718 మార్కులు సాధించిన ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కాలేజి విద్యార్థి సయ్యద్ హుస్సేన్, ఎంపీసీలో 937 మార్కులు సాధించిన ప్రభుత్వ జూనియర్ కాలేజి విద్యార్థి జెట్టి వెంకటకాశీ భార్గవ్, వెల్లాల గురుకుల పాఠశాలలో బైపీసీలో 976 మార్కులు సాధించిన విద్యార్థినులు భజంత్రి మునిజాహ్నవి, దిబ్బగాండ్ల ప్రియాంకలకు ప్రథమ బహుమతి కింద రూ.15వేలు అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను, అధ్యాపకులను, తల్లిదండ్రులను సన్మానించారు.

విద్యకు పెద్ద పీట

ప్రొద్దుటూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేశారని కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని అమృతానగర్ 16వ వార్డులోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం 300 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను సర్పంచ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లోకేష్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

బద్వేలు అర్బన్ : నీతిగా, నిజాయితీగా ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తున్న తమపై యువగళం పాదయాత్రలో లోకేష్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, లోకేష్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ళ కాలంలో బద్వేలు నియోజకవర్గంలో సుమారు రూ.1,056 కోట్ల మేర నిధులతో అభివృద్ధి పనులు జరిగడంతో పాటు రూ.2 వేల కోట్లతో గోపవరం సమీపంలో సెంచూరీ ప్యానల్ పరిశ్రమ ఏర్పాటు చేయడం జరిగిందని, అయితే లోకేష్ ఎవరో రాసి ఇచ్చిన స్క్రిప్టు ప్రకారం బద్వేలులో అభివృద్ధి నిల్ అని చెప్పడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో తమ పార్టీ నాయకులు భూ కబ్జాలకు పాల్పడ్డారని ఏవో సర్వే నెంబర్లు చదివి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నాలు చేశారని, వాస్తవంగా భూకబ్జాలు, నకిలీ పట్టాల తయారీలో తెలుగుదేశం పార్టీ నాయకులే నిందితులుగా ఉన్నారన్న విషయం లోకేష్ తెలుసుకోవాలన్నారు. బద్వేలు మున్సిపాలిటీకి ముఖ్యమంత్రి రూ.130 కోట్లు మంజూరు చేయగా ఆ పనులు జరగకుండా టీడీపీ నాయకులే ఆటంకాలు సృష్టిస్తున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బద్వేలు నియోజకవర్గానికి ఏం చేశామో చెప్పకుండా తమను, తమ పార్టీ నాయకులను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా బద్వేలు ఎమ్మెల్యే స్థలాన్నే కబ్జా చేశారని లోకేష్ మాట్లాడటం సరికాదని, ఎమ్మెల్యే కొనుగోలు చేసిన స్థలానికి సంబంధించిన పత్రాలను అమ్మిన వారు ఇవ్వకుండా జాప్యం చేస్తుండటంతో దానిపై ఆమె అధికారులను కలిశారని, దానిని కూడా పార్టీలకు అంటకట్టి రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, అల్లాబకాష్, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సుబ్బారెడ్డి, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు పుత్తా శ్రీరాములు, చెన్నకృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెటీరియల్ పంపిణీ

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెకండ్ సెమిస్టర్ బీకాం విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్ మెటీరియల్ పంపిణీ చేశారు. కామర్స్ అధ్యాపకులు ఈశ్వరయ్య బిజినెస్ ఎకనామిక్స్ పుస్తకాలను ఉచితంగా అందచేశారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు సులోచన, కామర్స్ డిపార్టమెంట్ హెడ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా

ప్రొద్దుటూరు : స్థానిక ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు సుబ్బలక్ష్మి, రాజీ పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను పరిష్కరిస్తాం

బ్రహ్మంగారిమఠం : స్పందనలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ ఈశ్వరయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని పలుగురాళ్లపల్లె గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో 50 మంది వారి సమస్యలతో వినతి పత్రాలు ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు స్పందన కార్యక్రమం సోమవారంతోపాటు ప్రతి గురువారం గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో ప్రత్యేక స్పందన మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, సర్పంచ్ సోమిరెడ్డిపల్లె మార్తమ్మ, ఉపసర్పంచ్ బసిరెడ్డి దుగ్గిరెడ్డి, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

గోపవరం : మండలంలో జరుగుతున్న జగనన్న ఇళ్ళ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజ లబ్ధిదారులకు సూచించారు. గురువారం టీ.సండ్రపల్లె, రాచాయపేట గ్రామాల్లో జరుగుతున్న జగనన్న ఇళ్ళ నిర్మాణాలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం నుండి ఎప్పటికప్పుడు రావాల్సిన బకాయిలు అందుతున్నాయని, కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని ఏజెన్సీ నిర్వాహకులను, లబ్ధిదారులను కోరారు. ప్రత్యేకాధికారి వెంట హౌసింగ్ డీఈ రత్నం, ఎంపీడీఓ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు విస్తరణకు భూమి పూజ

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని నెహ్రూ రోడ్డు విస్తరణ పనులకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ రూ.35 లక్షలతో ఈ వీధిలో రోడ్డు విస్తరణ, డ్రైనేజి కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వార్డు ఇన్‌చార్జి కాకర్ల నాగేశ్వరరెడ్డి, కౌన్సిలర్ అలవలపాటి అరుణాదేవి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, మాజీ జెడ్పీటీసీ పల్లా విజయభాస్కర్‌రెడ్డి, పద్మశాలీయ సంఘం పట్టణాధ్యక్షుడు అగ్గారపు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు పాల్గొన్నారు.

- 15వ వార్డు పరిధిలోని టూటౌన్ బైపాస్ రోడ్డులో రూ.18.10 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాచమల్లు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వార్డు కౌన్సిలర్ ముదిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఇతర కౌన్సిలర్లు జిలాన్ బాషా, సత్యం, నాయకుడు ఫయాజ్, వలంటీర్లు షబానా పర్వీన్, రాజీ పాల్గొన్నారు.

డాక్టర్ల ఇంట మెరిసిన విద్యా రత్నం



తల్లిదండ్రులు డాక్టర్ చాడా చెన్నకృష్ణారెడ్డి, డాక్టర్ కవితలతో లలిత్ రోహన్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన ప్రముఖ డాక్టర్ చాడా చెన్నకృష్ణారెడ్డి, డాక్టర్ కవితల కుమారుడు చాడా లలిత్ రోహన్‌రెడ్డి నీట్‌లో ప్రతిభ కనబరిచాడు. ఆల్ ఇండియా స్థాయిలో 339 ర్యాంకు సాధించాడు. నీట్‌లో 720 మార్కులకుగాను 700 మార్కులు సాధించాడు. తెలంగాణ ఎంసెట్‌లో 69వ ర్యాంకు పొందాడు. ఎయిమ్స్‌లో మెడిసిన్ చేసి పేద ప్రజలకు సేవ చేయాలన్నదే తన కోరిక అని లలిత్ తెలిపాడు.

1100 ర్యాంకు సాధించిన చప్పిడి మణిదీప్‌రెడ్డి



స్థానిక వైఎంఆర్ కాలనీకి చెందిన చప్పిడి భాస్కర్ రెడ్డి, కృష్ణవేణి కుమారుడు చప్పిడి మణిదీప్‌రెడ్డి నీట్‌లో ఆల్‌ఇండియా స్థాయిలో 1100 ర్యాంకు సాధించాడు. ఈడబ్ల్యూఎస్ కోటాలో 85వ ర్యాంకు, ఏపీ ఎంసెట్‌లో 56, తెలంగాణ ఎంసెట్‌లో 62వ ర్యాంకు సాధించాడు. తండ్రి భాస్కర్‌రెడ్డి వస్త్రవ్యాపారం చేస్తుండగా, తల్లి గృహిణి. కార్డియాలజి డాక్టర్‌గా ప్రజలకు సేవలందించడమే తన లక్ష్యమని మణిదీప్‌రెడ్డి తెలిపాడు.

ఎంసెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విష్ణువర్ధన్‌ను అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సృజన్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఎంసెట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. కోచింగ్ సెంటర్ విద్యార్థులు విష్ణువర్ధన్ 4108, శివచక్రధర్ రెడ్డి 9167, అనురాధ 10245, వెంకట శ్రీమణి 14419 ర్యాంకులు సాధించారు. అలాగే 20 వేలలోపు ర్యాంకులను 37 మంది విద్యార్థులు, 25 వేలలోపు ర్యాంకులు 45 మంది విద్యార్థులు పొందారు. వీరిని కోచింగ్ సెంటర్ డైరెక్టర్‌లు కె.సునీల్, కె.సృజన్, అధ్యాపకులు చార్లెస్, సురేష్, జనార్దన్, వాసు అభినందించారు.

నీట్‌లో ప్రతిభచాటిన దువ్వూరు విద్యార్థిని



దువ్వూరు : మండల కేంద్రానికి చెందిన తుపాకుల గురు వైష్ణవి జాతీయ స్థాయిలో జరిగిన నీట్ పరీక్షలో ప్రతిభ చూపి మెడిసిన్‌లో సీటు సాధించినట్లు తల్లిదండ్రులు చలమయ్య, పద్మ తెలిపారు. నీట్ పరీక్షలో 720 మార్కులకు 583 మార్కులు సాధించి 38వేలు ర్యాంకు సాధించినట్లు వారు చెప్పారు. మెడిసిన్‌లో సీట్ సాధించడం పట్ల తల్లిదండ్రులతోపాటు బంధువులు, మిత్రులు అభినందించారు.

శ్రీశైలం దేవాంగ నిత్యాన్నదాన సత్రం కమిటీ డైరెక్టర్‌గా వుట్టి నాగశయనం



ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం శ్రీశైలంలోని శ్రీ ఉమారామలింగేశ్వర దేవాంగ నిత్య అన్నదాన సత్రం కమిటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన సత్రం కమిటీ అధ్యక్షుడు బొమ్మన దుర్గాప్రసాద్‌రావు, కార్యదర్శి కాలేపు సత్యనారాయణ మూర్తి, సహాయ కార్యదర్శి వుట్టి వీరయ్యలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఉమారామలింగేశ్వర దేవాంగ సత్రం అభివృద్ధికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. వుట్టి నాగశయనం సత్రం కమిటీ డైరెక్టర్‌గా నియమితులవడం పట్ల పలువురు దేవాంగ ప్రముఖులు, కుల పెద్దలు అభినందనలు తెలిపారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

ప్రొద్దుటూరు : మూడు నుంచి ఆరేళ్లలోపు వయసుగల చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరుతూ ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు పరిధిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ అరుణకుమారి, సూపర్‌వైజర్లు కళావతి, రఫియా పాల్గొన్నారు. నడింపల్లె స్లాటర్ హౌస్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కోఆర్డినేటర్ స్వరూప రాణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి దాతృత్వం

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తుమ్మల ఈశ్వరరెడ్డి జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థినులు సోమల వెంకటరామశరణ్య, శీల హరిణిలకు ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున నగదు అందించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో వారికి నగదు ఇచ్చారు.

భూములు లేని వారికి భూములు ఇవ్వండి

గోపవరం : అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూములు లేని వారికి భూములు ఇవ్వాలని ఎస్.రామాపురం దళితులు స్పందనలో అధికారులకు అర్జీలు ఇవ్వడం జరిగింది. గురువారం మండలంలోని టీ.సండ్రపల్లె సచివాలయంలో అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది స్పందన కార్యక్రమం నిర్వహించారు. భూములు ఉండి, రైతుభరోసా అందుకుంటున్న రైతులకు అసైన్‌మెంట్ కమిటీలో భూ పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని, ఈ విషయంపై గతంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీలు ఇవ్వడం జరిగిందని, కానీ ఇంత వరకు పరిశీలనలోకి తీసుకోకపోవడంతో తిరిగి 30 మంది దళితులు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రత్నం, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ రామకృష్ణ, ఏఓ అరవిందనాయక్, ఈఓపీఆర్‌డీ హసీనా, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఆలయ భూములు వేలం పాట

రాజుపాళెం : మండలంలోని పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాలకు సంబంధించిన 14.80 ఎకరాలు శనివారం కౌలుకు వేలంపాట వేయనున్నట్లు ఆలయ చైర్మన్ విజయలక్ష్మి, ఈఓ నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అందులో రాజోలి గ్రామ పొలం 7.80 ఎకరాలు, వెల్లాల గ్రామ పొలం 7 ఎకరాలు వేయనున్నారు. ఈ వేలంపాటలో పాల్గొనే ప్రతి పాటదారుడు రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలని, పాటలో భూములు దక్కించుకున్న రైతులు డబ్బులు చెల్లించి మూడు సంవత్సరాల పాటు పంటలు పండించుకోవచ్చునని తెలిపారు. అనంతరం ఆలయాలకు భక్తులు సమర్పించిన పలురకాల వస్తువులను వేలంపాట వేయనున్నామన్నారు. ఈ పాటలో పాల్గొనే పాటదారుడు రూ.1000 డిపాజిట్ చెల్లించాలని తెలిపారు.